## ఘనంగా దేవి శరన్నవరాత్రోత్సవాలు



2లో





# మనం

మెదక్ సంగారెడ్డి సిద్దిపేట

శనివారం | 21 | అక్టోబర్ | 2023 | పేజీలు : 8


## బిఆర్ఎస్, కాంగ్రెస్ అవినీతి

# కవల పిల్లలు

- శత్రువుల కుట్రలను చీల్చుకొని గెలిచిన వాడు మీ రఘునందన్‌రావు
- ఐదేళ్ల అధికారమిస్తే దుబ్బాక అభివృద్ధిలో అగ్రగామి
- కేంద్ర మహిళా శిశు సంక్షేమ, మైనార్టీ శాఖ మంత్రి స్మృతి ఇరానీ

- కాంగ్రెస్‌లో గెలిచే వారంతా బిఆర్ఎస్ గూటికే
- లీకుల ప్రభుత్వం బిఆర్ఎస్... అభివృద్ధి ప్రభుత్వం భాజపా
- అధర్మ చక్రవర్తి కేసీఆర్... ధర్మ సంరక్షకుడు ప్రధాని మోదీ
- జయ జయహే తెలంగాణ గీతాన్ని ఎందుకు రాష్ట్ర గీతంగా ప్రకటించలేదు







దుబ్బాక/ దుబ్బాక టౌన్, అక్టోబర్ 20, మనం న్యూస్: గతంలో కేంద్రంలో అధికారంలో ఉన్నంత కాలం కాంగ్రెస్ పార్టీ స్కామ్‌లు చేస్తే, నేడు తెలంగాణలో అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ సైతం అవినీతికి పాల్పడుతూ అడ్డగోలుగా ప్రజా ధనాన్ని దోచుకుంటూ అవినీతికి కవల పిల్లలుగా బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు నిలిచాయని కేంద్ర మహిళా శిశు సంక్షేమ, మైనార్టీ శాఖ మంత్రి స్మృతి ఇరానీ ఎద్దేవా చేశారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో సాధించుకున్న తెలంగాణలో సామాన్య ప్రజానీకం మరింత ఇక్కట్ల పాలవుతుంటే కల్వకుంట్ల కుటుంబం మాత్రం నాలుగు పదవులతో సంతోషంగా గడుపుతుందని ఆమె విమర్శించారు. దుబ్బాక పట్టణంలోని తిరుమల గార్డెన్స్‌లో శుక్రవారం రోజున దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు సమక్షంలో నిర్వహించిన నారీ వందన్ శక్తి కార్యక్రమానికి కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమెకు బీజేపి శ్రేణులు భారీ ఎత్తున బైక్ ర్యాలీతో ఘన స్వాగతం పలికి, సభాస్థలి వద్ద గజమాలతో ఆమెను సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ శ్రీ దుర్గామాత నవరాత్రి ఉత్సవాల సమయాన రఘునందన్‌రావు నాయకత్వం వహిస్తున్న దుబ్బాక నియోజకవర్గానికి రావడం ఎంతో సంతోషంగా ఉందని, అమ్మవారి ఆశీస్సులతో దుబ్బాక ప్రజలంతా సంతోషంగా ఉండాలని ఆమె ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రంలో అధర్మానికి, ధర్మానికి మధ్య యుద్ధం జరుగుతోందని, ఇందులో కేసీఆర్ అధర్మం వైపు అడుగులు వేస్తుంటే ఎప్పటికప్పుడు ఆ అడుగులకు అడ్డు పడుతూ రఘునందన్‌రావు ధర్మం వైపున ప్రజలను నడిపించేందుకు తన శాయశక్తులా కృషి చేస్తున్నారన్నారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మీ నాయకుడు రఘునందన్‌రావు ధర్మం నాలుగు పాదాలపై నిలబడేలా సంకల్పం తీసుకున్నాడని, ఇందుకు అమ్మవారి ఆశీస్సులతోపాటు దుబ్బాక నియోజకవర్గ మహిళామణులు, ప్రజల ఆశీస్సులు ఎంతో మిగతా 2లో..


## కొండపాకలో ఘనంగా సద్దుల బతుకమ్మ

5లో




## దుబ్బాక రూపురేఖలు మరాయి

- పూర్తిస్థాయి అవకాశమిస్తే సమగ్రాభివృద్ధి మన సొంతం
- నేనొచ్చినా పింఛన్ ఆగలే... మోటార్లకు మీటర్లు రాలే... రావు కూడా
- బిఆర్ఎస్‌వి బెదిరింపులు.... అక్కున చేర్చుకునేది భారతీయ జనతా పార్టీ
- దుబ్బాక పేరు పలకకుండా అసెంబ్లీ గడిచిన రోజు లేదు
- కొలువుల విషయాలన్నీ కోర్టు మెట్లెక్కుతున్నాయి
- నా ఆశ... నా శ్వాస దుబ్బాక ప్రజలే
- దుబ్బాక ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు

3లో



## బిఆర్ఎస్, కాంగ్రెస్‌లు అవినీతి

# కవల పిల్లలు



మొదటి పేజీ తరువాయి..

అవసరమన్నారు. నవరాత్రుల తర్వాత రోజైన విజయ దశమి రఘునందన్‌రావు విజయోత్సవ దినోత్సవం కావాలని ఆకాంక్షిస్తున్నానని ఆమె ఎమ్మెల్యే రఘునందన్‌రావుకు శుభాకాంక్షలు తెలియజేశారు. నేడు తెలంగాణ రాష్ట్రంలో ఏవైనా నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో సాధించుకున్నారో అందులో ఏ ఒక్కటి కూడా కేసీఆర్ అమలు చేయడం లేదని, ముందుగా నీళ్ల కోసం 30 వేల నుండి 40 వేల కోట్ల మధ్య ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టు వ్యయాన్ని ఏకంగా లక్ష కోట్లకు పెంచి ప్రజా నిధులను ఫామ్‌హౌజ్‌కు తరలించుకున్నాడని ఆరోపించారు. నియామకాల పేరుతో గద్దెనెక్కి ఇంత వరకు ఏ ఒక్కరికి ఉద్యోగం ఇవ్వలేదని, ఇచ్చిన నోటిఫికేషన్‌లన్నీ కూడా కోర్టు మెట్లు ఎక్కుతున్నాయంటే ప్రభుత్వ పాలన ఏ రకంగా ఉందో అర్థమవుతుందని ఆమె ఎద్దేవా చేశారు. తెలంగాణ ఏర్పాటు సమయంలో మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని లోటు బడ్జెట్‌లోకి తీసుకువచ్చిన రావణాసురుని అంతం రఘునందన్‌రావుతోనే సాధ్యమవుతుందని, మీరంతా అతని సైనికుల్లా తన వెంట ఉండి తనను ముందుకు నడిపించాలని ఆమె కోరారు. ఓ వైపు సిద్దిపేట, సిరిసిల్ల, గజ్వేల్‌లలో కల్వకుంట్ల కుటుంబ సభ్యులు ఉన్నప్పటికీ, వారందరి కుట్రలను తిప్పికొట్టి దుబ్బాక గడ్డపై గెలిచి ప్రభుత్వం మెడలు వంచి దుబ్బాక అభివృద్ధికి కృషి చేస్తున్నాడన్నారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఒక్కటేనని అవి అవినీతికి పుట్టిన కవల పిల్లలుగా ఆమె అభివర్ణించారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో గెలిచిన ఎమ్మెల్యేలు, ఎంపిలు అంతా కూడా బిఆర్ఎస్ గూటికే చేరుకున్నారని, ఇప్పుడు కూడా వచ్చే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటేసినా, బీఆర్ఎస్ పార్టీకి ఓటేసినా వారంతా ఒకే గూటి పక్షులని, కాంగ్రెస్‌లో గెలిచిన వారంతా బిఆర్ఎస్‌లోకే వెళ్లి మీ ఓటుకు విలువ లేకుండా పోతుందని తెలిపారు. రాష్ట్రంలో పదవ తరగతి ప్రశ్నా పత్రం నుండి గ్రూప్స్ పరీక్ష ప్రశ్నా పత్రాల వరకు లీకేజీల వ్యవహారం జరుగుతుందంటే అందులో పూర్తిగా కేసీఆర్ కుటుంబం కూడా ఉందని, లీకుల ప్రభుత్వం బిఆర్ఎస్ అయితే అభివృద్ధి చేసే ప్రభుత్వం భారతీయ జనతా పార్టీ అని ఆమె ఘంటాపదంగా ఉద్ఘాటించారు. కరోనా సమయంలో ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ప్రధాని మోదీయే దేశవ్యాప్తంగా ఉచితంగా కరోనా వ్యాక్సిన్‌ను పంపిణీ చేశారని, రాహుల్‌గాంధీయో, లేక సోనియా గాంధీయో లేక ఈ కల్వకుంట్ల కుటుంబమో అధికారంలో ఉంటే ప్రజలందరికీ ఉచితంగా కరోనా వ్యాక్సిన్ వచ్చి ఉండేదా అని ప్రశ్నించారు. కేసీఆర్, కేటీఆర్‌లకు వచ్చిన కరోనాను పోగొట్టింది కూడా మోదీ ఇచ్చిన వ్యాక్సినే అనే విషయాన్ని వారు గుర్తించాలని ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ద్వారా డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించి ఇస్తే వాటిని తామే నిర్మించి ఇచ్చామని బిఆర్ఎస్ పార్టీ చెప్పుకోవడానికి సిగ్గుపడాలన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రజలను ఉవ్వెత్తున ఎగసిపడేలా ఉత్తేజపరిచిన జయ జయహే తెలంగాణ గీతాన్ని రాష్ట్ర గీతంగా కేసీఆర్ ప్రభుత్వం ఎందుకు ఇంత వరకు ప్రకటించలేదని ఆమె ప్రశ్నించారు. కరోనా కష్టకాలం నుండి బయట పడేందుకు సామాన్య ప్రజల కోసం ప్రధాని మోదీ 60 లక్షల మందికి రాష్ట్రంలో ముద్ర యోజన కింద, 6 లక్షల మంది చిరు వీధి వ్యాపారులకు ఎలాంటి షరతులు లేకుండా నేరుగా ఆర్థిక సాయం చేయడం జరిగిందన్నారు. రాష్ట్రానికి వచ్చిన వ్యాక్సిన్, టెక్స్‌టైల్ పార్కులు, ఉచిత బియ్యం, సిద్దిపేటకు వచ్చిన రైలు, మెదక్ సిద్దిపేట ఎల్కతుర్తి 765 డిజి జాతీయ రహదారి ఇవన్నీ కూడా కేసీఆర్ ఇవ్వలేదని, ప్రధాని మోదీ ఇక్కడి ప్రజల కోసం మంజూరు చేసిన మహానేత అని కొనియాడారు. అలాంటప్పుడు మీ అందరి ఓటు మోడీ బాటలో నడిచే, మీ కోసం ప్రశ్నించే రఘునందన్‌రావుకే వేసి ఆశీర్వదించి బీజేపి పార్టీకి అవకాశం ఇవ్వాలని, అభివృద్ధికి అడుగులు వేసుకోవాలన్నారు.

## నేటి నుండి 'కొత్త' ప్రచారం

### మల్లన్నకు ప్రత్యేక పూజలతో ప్రారంభం



దుబ్బాక, అక్టోబర్ 20, మనం న్యూస్: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని దుబ్బాక బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నాడు ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నేడు దుబ్బాక మండలంలోని రేకులకుంట మల్లికార్జున స్వామి ఆలయంలో స్వామి వారిని దర్శించుకొని ప్రచారాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. దుబ్బాక మండలం లోని రాజక్కపేట, చెల్లాపూర్, వడ్డెర కాలనీ, బల్వంతాపూర్, నర్లన్‌గడ్డ, హసన్‌మీరాపూర్, అప్పనపల్లి, దుంపలపల్లి గ్రామాల్లో నేడు ప్రచారం ఉంటుందని, ఈ ప్రచారానికి బిఆర్ఎస్ కార్యకర్తలు తరలి రావాలని పిలుపునిచ్చారు.

## కురుమ విద్యార్థులకు ఘన సన్మానం



సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 20, మనం న్యూస్: సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో కురుమ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కురుమ విద్యార్థులలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉద్యోగులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం జిల్లా అధ్యక్షులు కోరె ఎల్లయ్య పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులకు నూతనోత్తేజాన్ని కలిగించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమం నిర్వహణ పట్ల ఉద్యోగ సంఘం నాయకులను అభినందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో 50 మంది విద్యార్థులకు నూతనంగా ఉద్యోగాలు పొందిన వారికి సన్మానం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కురుమ ఉద్యోగ సంఘం అధ్యక్షులు కొలుపుల రాములు, ప్రధాన కార్యదర్శి స్వామి, కార్యవర్గ సభ్యులు కోరె రాములు, బండారి మల్లేశం, వెంకట్, వెంకటేశ్వర్లు, ధన్‌ఘర్ వెంకట్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.


## ఘనంగా దేవి శరన్నవరాత్రోత్సవాలు



సిద్దిపేట, అక్టోబర్ 20, మనం న్యూస్ ప్రతినిధి: దేవి శరన్నవరాత్రోత్సవాలు అత్యంత వైభవంగా, కన్నుల పండువగా కొనసాగుతున్నాయి. పట్టణంలోని వార్డు నెంబర్ 15 ఇమాంబాద్‌లో హిందు వాహిని శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవరాత్రోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శుక్రవారంనాడు మూలా నక్షత్రాన్ని పురస్కరించుకొని నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా హోమం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక హనుమాన్ దేవాలయ ఆవరణలో కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాల్లో ప్రతి రోజు ఒక కొత్త కార్యక్రమంతో ఆకట్టుకుంటున్నారు. ఉదయం వేళలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం వేళలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని అత్యంత సాంప్రదాయబద్ధంగా సంస్కృతిని ప్రతిబింబించే విధంగా కూర్చోబెట్టి అరిటాకుల్లో వడ్డించిన భోజనాన్ని భక్తులు స్వీకరించి సంతృప్తి వ్యక్తం చేశారు.

### –దర్శించుకున్న ఏసిపి, మున్సిపల్ మాజీ చైర్మన్





దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కొనసాగుతున్న నవరాత్రుల్లో భాగంగా శుక్రవారంనాడు అమ్మవారిని సిద్దిపేట ఏసిపి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, సిఐలు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సు, కో ఆప్షన్ సభ్యులు పొడిశేటి సత్తయ్య, సివిల్ సప్లై సభ్యులు దరిపల్లి శ్రీను, భాస్కర్‌రెడ్డిలు దర్శించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు యువసేన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవరాత్రోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గూడ శ్రీనివాస్‌రెడ్డి, పప్పుల కర్ణాకర్‌రెడ్డి, హిందూ వాహిని ప్రతినిధులు దమ్మ కమలాకర్‌రెడ్డి, చీకోటి నర్సాగౌడ్, జక్కుల నవీన్, నాయిని మధుసూదన్‌రెడ్డి, యువసేన ప్రతినిధులు మేడిశెట్టి రాజకిరణ్, రాదారంకర్ణాకర్, గూడ సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దుబ్బాక రూపురేఖలు మారాయి



దుబ్బాక/దుబ్బాక టౌన్, అక్టోబర్ 20, మనం న్యూస్ః ఒక్క అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేసి చూపిస్తానని మాట ఇచ్చాను.... మడమ తిప్పకుండా ఇచ్చిన కొద్ది కాలంలోనే దుబ్బాక రూపు రేఖలు మార్చి చూపించాను.... ఇప్పుడు పూర్తి స్థాయి అవకాశం ఇవ్వండి మీ ఆశీస్సులతో దుబ్బాక నియోజకవర్గం సమగ్రాభివృద్ధి చేసి చూపిస్తానని దుబ్బాక ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు ఉద్ఘాటించారు. ప్రజల కోసమే పని చేయాలనేది బీజేపి సిద్ధాంతమని, ఆ సిద్ధాంతంపైనే నిలబడి దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నానని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం రోజున దుబ్బాక పట్టణంలోని తిరుమల ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన నారీ శక్తి వందన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర మహిళా శిశు సంక్షేమ, మైనార్టీ శాఖ మంత్రి స్మృతి ఇరానీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రఘునందన్‌రావు మాట్లాడుతూ దుబ్బాక ప్రజలు తనపై నమ్మకంతో తనను గెలిపించి తనకిచ్చిన కొంత కాలంలోనే దుబ్బాక పట్టణంలో నూతన బస్టాండ్‌ను నిర్మించుకున్నామని, వంద పడకల ఆసుపత్రి, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల ప్రవేశాలు, ఐఓసి భవనం ప్రారంభోత్సవంతోపాటు నూతన రోడ్లు వంటివి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేయడం జరిగిందన్నారు. నేను అధికారంలోకి రాకముందు సాయంత్రం 6 దాటితే చాలు సిద్దిపేట, హైదరాబాద్‌కు వెళ్లే పరిస్థితి నుండి నేడు ఏ రాత్రైనా దుబ్బాకలోనే అన్ని రకాల వైద్య సేవలు అందించేలా ఆసుపత్రిని సకల వసతులతో అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. మొన్నటి దాకా మాట్లాడని వ్యక్తి, ఎంపి స్థాయిలో ఉండి దుబ్బాకను పట్టించుకోని సన్నాయికారి నేడు అభివృద్ధి చేస్తానంటూ ప్రజల ముందుకు వచ్చి సన్నాయి మాటాలు మాట్లాడడం చూస్తుంటే హాస్యాస్పదంగా ఉందన్నారు. పదేళ్లపాటు ఎంపిగా ఉండి దుబ్బాక నియోజకవర్గానికి, దుబ్బాక అభివృద్ధికి ఏం చేశాడని ప్రశ్నించారు. నేను అధికారంలోకి రాకముందు ఉన్నది బిఆర్ఎస్ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ ఎంపి, బిఆర్ఎస్ మంత్రులే కదా... మరి దుబ్బాకలో పై అభివృద్ధి పనులెందుకు పూర్తి చేయలేదని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఎంపిగా ప్రభాకర్‌రెడ్డి గజ్వేల్, సిద్దిపేట అభివృద్ధికి చేసిన కృషిలో దుబ్బాకపై కొంతమేరైనా చేసి ఉంటే బాగుండేదన్నారు. నాడు ఉప ఎన్నికలో దుబ్బాక బస్టాండ్‌ను అవహేళన చేస్తూ మాట్లాడిన మంత్రితోనే దుబ్బాక నూతన బస్టాండ్‌కు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేయించానని గర్వంగా చెప్పుకున్నారు. దుబ్బాక ప్రజలకు ఏం కావాలో తెలియని వ్యక్తి కొత్త ప్రభాకర్‌రెడ్డి అని, కనీసం తన వెంట ఉండే నాయకులను సైతం గుర్తించలేని వ్యక్తి దుబ్బాక ప్రజల మనసును ఎలా తెలుసుకుంటాడని, దుబ్బాక కోసం నోరు తెరిచి ఏం కావాలని అడుగుతాడన్నారు. బీజేపి అధికారంలోకి వస్తే పింఛన్‌లు ఆగిపోతాయి, మోటార్లకు మీటర్లు వస్తాయని మాట్లాడిన మంత్రి నేడు దుబ్బాక నియోజకవర్గంలో పింఛన్‌లు ఆగిపోయాయో లేక మరింతగా పెరిగాయో కళ్లు తెరిచి చూడాలన్నారు. అంతేకాకుండా నియోజకవర్గంలో ఎక్కడైనా మోటార్లకు మీటర్లు వచ్చాయా అని ప్రశ్నించారు. ఒకప్పుడు అసెంబ్లీలో దుబ్బాక పేరే వినిపించేది కాదని, కానీ నేడు ప్రతి అసెంబ్లీ సమావేశంలో దుబ్బాక పేరు వినిపించకుండా అసెంబ్లీ గడిచిన రోజు లేదని, ప్రతి రోజు తాను దుబ్బాక నియోజకవర్గం గురించి ప్రభుత్వాన్ని ప్రశ్నించడం జరిగిందని, అవసరమైన పనులు చేయించుకున్నామన్నారు. బిఆర్ఎస్ నాయకులు నోరు తెరిస్తే అబద్ధాలు, మోసపూరిత హామీలు తప్ప ప్రజలకు పనికి వచ్చే మాటలే రావని ఎద్దేవా చేశారు. దుబ్బాకలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్‌లు అసంపూర్తిగా ఉండి లబ్ధిదారులకు ఇవ్వకుండా వదిలేస్తే నేనే స్వయంగా లబ్ధిదారులను ఇళ్లలోకి పంపించి పనులన్నీ పూర్తి చేయిస్తే బిఆర్ఎస్ నాయకులు వచ్చి నీళ్లు, కరెంటు సరఫరా ఆపివేస్తూ బెదిరింపులకు గురిచేసినప్పటికీ భారతీయ జనతా పార్టీ తరుపున తాను అండగా నిలిచి ప్రజలందరి సమన్వయంతో ప్రభుత్వంతో కొట్లాడి కరెంటు, నీళ్ల సరఫరా తిరిగి పునరుద్ధరించుకోగలిగామన్నారు. దుబ్బాక పట్టణంలో తాను రాకముందు కాని అభివృద్ధి పనులు ఇప్పుడు ఏ విధంగా జరుగుతున్నాయని, ఒకవేళ తాము ఇప్పుడు చేయకపోతే రఘునందన్‌రావు ప్రశ్నించి ప్రజల ముందు దోషులుగా నిలబెడుతాడనే భయంతోనే వారిప్పుడు పనులు చేస్తున్నారన్నారు. ఉద్యోగాల పేరుతో నిరుద్యోగ యువతను ప్రభుత్వం మోసం చేస్తూ వస్తుందని, రాష్ట్రం ఏర్పడిన తర్వాత విడుదల చేసిన ప్రతి నోటిఫికేషన్ కోర్టు మెట్లు ఎక్కకుండా ముందుకు సాగలేదన్నారు. పరీక్షల నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఉద్యోగ కల్పనలో



ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. నా ఆశ, నా ధ్యాస అంతా దుబ్బాక ప్రజలేనని, దుబ్బాక అభివృద్ధే నా ధ్యేయమని గ్రామీణ నియోజకవర్గమైనప్పటికీ సిద్దిపేట, గజ్వేల్ పట్టణాలతో తీసిపోని విధంగా మార్చడమే తన లక్ష్యమన్నారు. ఇందుకు మీ అందరి ఆశీస్సులు తనపై ఉండాలని కోరారు. రఘునందన్‌రావు ఎవరికీ, ఎవరి బెదిరింపులకు భయపడడని, మీ ప్రేమ, ఆదరాభిమానాలు, ఆశీస్సులు ఉన్నంత కాలం మీతోనే ఉంటానని, మీ కోసమే పని చేస్తానన్నారు. కావున వచ్చే ఎన్నికల్లో ఐదేళ్ల పాటు పూర్తి స్థాయి అవకాశమిస్తే దుబ్బాక ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి చేసి చూపిస్తానని ఆయన పేర్కొన్నారు. అనంతరం పలు గ్రామాల నుండి బిఆర్ఎస్ నాయకులు, వార్డు మెంబర్లు, మహిళలు స్మృతి ఇరానీ సమక్షంలో బీజేపి పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబటి బాలేష్ గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ ఎస్ఎన్ చారి, మున్సిపల్ అధ్యక్షులు కిష్టమ్మగారి సుభాష్‌రెడ్డి, పార్లమెంట్ కో కన్వీనర్ చింత సంతోష్‌కుమార్ గుప్త, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంద అనిల్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి మచ్చ శ్రీనివాస్, జిల్లా మహిళా మోర్చ నాయకురాలు అరుణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గోవిందుగారి సుధారెడ్డి, మహిళా నాయకురాలు ఎంగారి నవ్యరెడ్డి, కౌన్సిలర్ మట్ట మల్లారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు అంబటి శివ ప్రసాద్ గౌడ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వార్డు మెంబర్లు, నాయకులు జిగిరి అమర్ సుంకు ప్రవీణ్, దూలం వెంకట్ గౌడ్, బోయ రాజశేఖర్, రమేష్‌రెడ్డి, పుట్ట వంశీ, రాగుల వినీత్ గౌడ్, పల్లె నిహాల్ గౌడ్, కొండె ఎల్లారెడ్డి, సప్తగిరి, బాచి, మరాటి బాబు, రవిందర్ తదితరులు పాల్గొన్నారు.



## దుబ్బాక అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

**-బిఆర్ఎస్, బీజేపి పాలనతో విసుగుచెందిన ప్రజలు**

**-దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి**

**-వివిధ పార్టీల నుండి సుమారు 50 మంది కాంగ్రెస్‌లోకి చేరికలు**

దుబ్బాక టౌన్, అక్టోబర్ 20, మనం న్యూస్ః దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, నేడు బిఆర్ఎస్, బీజేపి పార్టీ నుండి ఎంతో మంది కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రోజున దుబ్బాక, మండల పరిధిలోని రామక్కపేట గ్రామానికి చెందిన 50 మంది మహిళలు, యువకులు, వివిధ పార్టీల నాయకులు చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుబ్బాక గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరడం తథ్యమని తొమ్మిదేళ్ల బిఆర్ఎస్ పాలనలో దుబ్బాక నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. గత ముత్యంరెడ్డి హయాంలోనే దుబ్బాక అభివృద్ధి జరిగిందన్నారు. బిఆర్ఎస్, బీజేపి పాలనతో విసుగుచెంది కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రం, దుబ్బాక నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందన్న నమ్మకంతో ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారన్నారు. దుబ్బాక నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కొంగరి రవి, ఉపాధ్యక్షులు నరేందర్‌రెడ్డి, మున్సిపల్ జనరల్ సెక్రటరీ మంద శ్రీనివాస్, నియోజకవర్గ అసెంబ్లీ జనరల్ సెక్రటరీ ఆకుల భరత్, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు లక్ష్మి, నాయకులు బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపి పార్టీకి రాజీనామా చేసిన బద్దిపడిగ శ్రీనివాస్‌రెడ్డి



చేర్యాల, అక్టోబర్ 20, మనం న్యూస్ః మద్దూరు మండలంలోని నర్సాయపల్లి గ్రామానికి చెందిన బద్దిపడిగ శ్రీనివాస్‌రెడ్డి బీజేపి పార్టీకి రాజీనామా చేశారు. జనగామ, సిద్దిపేట జిల్లాలో అతి తక్కువ సమయంలో తనకంటూ మంచి నాయకునిగా గుర్తింపు తెచ్చుకున్న బద్దిపడిగ శ్రీనివాస్‌రెడ్డి బీజేపిలో రాష్ట్ర స్థాయి నాయకులతో సత్సం బంధాలు ఏర్పరచుకున్నారు. అధికార పార్టీ ఎన్ని ఇబ్బందులకు గురి చేసినా తలవంచని నాయకునిగా జనగాం, సిద్దిపేట జిల్లాలో వ్యక్తిగతంగా ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపి పార్టీ గొప్ప సిద్ధాంతాల పార్టీ అని, నాకు రాజకీయ మనుగడ నేర్పిన పార్టీ అని, అలాంటి పార్టీకి రాజీనామా చేయడం బాధగా ఉన్నా మా సొంత గ్రామమైన నర్సాయపల్లి ముద్దుబిడ్డ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి జనగామ అసెంబ్లీ టికెట్ రావడం సంతోషంగా ఉందని, త్వరలోనే కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నానన్నారు. ప్రతాప్‌రెడ్డి గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. జనగామ ప్రాంతంలో రాక్షస పాలన అంతం కావాలంటే లోకల్ వ్యక్తిని గెలిపించుకోవాలని, కుల, మత భేదం లేకుండా అందరూ కలిసి రావాలని ఆయన కోరారు.



## రాజ్‌గోపాల్‌పేటలో ఘనంగా సద్దుల బతుకమ్మ

నంగునూరు, అక్టోబర్ 20, మనం న్యూస్ః నంగునూరు మండల పరిధిలోని రాజ్‌గోపాల్‌పేట గ్రామంలో శుక్రవారం సదుదల బతుకమ్మ వేడుకలను మహిళలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే తీరొక్క పూవులు తెచ్చి పోటీపడి పెద్ద పెద్ద బతుకమ్మలను పేర్చారు. ఈసారి బతుకమ్మకు తంగేడు, గునుగు పువ్వు కొరత ఉండడంతో ఎక్కువగా బంతి పూవుల మీదనే ఆధారపడ్డారు. మండలంలోని అన్ని గ్రామాల్లో 9వ రోజు సద్దుల బతుకమ్మ పండుగ జరుపుకుంటే రాజ్‌గోపాల్‌పేట గ్రామంలో మాత్రం ఏడవ రోజు సద్దుల బతుకమ్మ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. ఉదయాన్నే మహిళలు పట్టు వస్త్రాలు ధరించి ప్రధాన వీధుల్లో ఆటపాటలతో మునిగిపోయారు. గ్రామంలో ఎక్కడ చూసినా బతుకమ్మ పాటలతో మార్మోగించారు. బతుకమ్మ ఆటల అనంతరం పెద్ద చెరువు వద్ద బతుకమ్మలతో ర్యాలీగా వెళ్లి నిమజ్జనం చేశారు. సద్దుల బతుకమ్మ పండుగకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజేంద్ర, ఎంపిటిసి సుమలత చందు, ఉప సర్పంచ్ మహేష్, నాయకులు రంగురాజు గౌడ్, కమల్, షరీఫ్, పరమాండ్ల మల్లేశం, మహిళా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జోరుగా ఇసుక దందా

-ట్రాక్టర్ల స్పీడుకు రైతన్న బెంబేలు

-చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న పోలీస్ మైనింగ్ అధికారులు

-ప్రభుత్వ ఆదాయానికి గండి

చిన్నకోడూరు, అక్టోబర్ 20, మనం న్యూస్ః జోరుగా అక్రమ ఇసుక రవాణా మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతుంది. అక్రమ దందాకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో తూగుతున్నారన్న ఆరోపణలతో ఈ తతంగమంతా నడుస్తుందంటూ వార్తలు పుట్టుకొస్తున్నాయి. గత ఆరు నెలలుగా కంటికి కనబడని ఇసుక ట్రాక్టర్లు ఇప్పుడు పెద్ద మొత్తంలో రయ్‌రయ్‌మంటూ రోడ్లపైకి వస్తుంటే వ్యవసాయ పొలాలకు వెళ్లే రైతులకు గుండెలు గుబేలుమంటున్నాయి. ఇంత తంతు జరుగుతున్నా అటు రెవెన్యూ అధికారులు కానీ, ఇటు పోలీసులు కానీ పట్టుకున్న దాఖలాలు లేవు. ఇసుకాసురుల మామూళ్లకు తలొగ్గిన పోలీసులు చూసీ చూడనట్లు ఉంటున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. మండలంలో ఎక్కడ చూసినా ఇసుక డంప్‌లు దర్శనమిస్తున్నాయి. ఇందుకు కారణం అధికారులు మామూళ్లకు అలవాటు పడ్డారన్న నిజాన్ని చెప్పక తప్పదు. మండల వ్యాప్తంగా ఇంటి నిర్మాణాలకు అవసరమైన ఇసుకను రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం, సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం నుండి రాత్రి వేళలో ట్రాక్టర్లు, టిప్పర్ల సాయంతో తరలిస్తున్నారు. ప్రతి రోజు రాత్రి 8 గంటలకు మొదలుకొని తెల్లవారు 8 గంటల వరకు జోరుగా ఇసుక రవాణా సాగుతోంది. దీనికి తోడు మితిమీరిన వేగం, మైనర్లైన డ్రైవర్లు ఇష్టారీతిన రాత్రి వేళలో మద్యం సేవిస్తూ ట్రాక్టర్లను నడపడంతో రోడ్డు పక్కన నివసిస్తున్న ప్రజలు ఎప్పుడు తమకు ప్రమాదం పొంచి ఉందోనని ప్రాణాలను అరచేతిన పట్టుకొని బిక్కుబిక్కుమంటున్నారు. అక్రమ దందాకు అడ్డుకట్ట వేయాల్సిన



అధికారులే గేట్లు ఎత్తి వేయడంతో ప్రభుత్వ ఆదాయానికి పెద్ద మొత్తంలో గండిపడుతుందన్న ఆరోపణలు వస్తున్నాయి. అక్రమ ఇసుక రవాణా చేసే వ్యక్తుల మధ్య ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా మారడంతో ఇంతిస్తున్నాం, అంతిస్తున్నామంటూ అధికారుల గురించి మండల కేంద్రంలోని హోటళ్ల వద్ద మాట్లాడుకుంటున్నారన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. తమ ప్రాణాలను ఇసుక ట్రాక్టర్ల నుండి కాపాడాలని, గతంలో లేని ఇసుక రవాణా ఇప్పుడే ఇలా పెద్ద మొత్తంలో ఎందుకు నడుస్తుందని అధికారులు అక్రమార్కులకు అమ్ముడు పోయారా అంటూ రైతులు, ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఏదేమైనా గత ఆరు నెలల క్రితం నడవని ఇసుక రవాణా ఇప్పుడు ఇలా ఎందుకు మొదలైందో అధికారులే అర్థం చేసుకోవాలి.



## దేవి నవరాత్రి ఉత్సవాలకు అంకురార్పణం

### మహాగణపతి పూజ మహా గణపతి హోమం



కొమురవెల్లి, అక్టోబర్ 20, మనం న్యూస్ః మండల కేంద్రంలోని శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయంలో దేవి నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా శుక్రవారం దేవి నవరాత్రి ఉత్సవములకు అంకురార్పణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా గంగా సేకరణ, మహాగణపతి పూజ, గౌరీ పూజ, రక్షాబంధనం, ఋత్విక్‌వరణం, అఖండ దీపస్థాపన, పంచకళశ స్థాపన, నవగ్రహాది మంటపదేవత ఆవాహనం, దేవి శతుశస్టు ప్రచార పూజ, హవిస్తులు మహా సరస్వతి ఆహ్వానం, మహా మంగళహారతి, మంత్రపుష్పం, పూజ నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ జరుపుకొని పూజా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కార్య నిర్వహణ అధికారి వైరాగ్యం అంజయ్య, ప్రధానార్చకులు మహదేవుని మల్లికార్జున్, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సరస్వతి దేవిగా అమ్మవారి దర్శనం



సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 20, మనం న్యూస్ః నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వివిధ అవతారాల్లో దర్శనమిస్తున్న అమ్మవారు శుక్రవారం సాయంత్రం సరస్వతి దేవి అవతారంలో విశేష పూజలు అందుకుంది. సిద్దిపేట అర్బన్ మండలం బట్టి రామన్నపల్లి గ్రామంలో దుర్గామాత యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వెలిసిన అమ్మవారు సరస్వతి దేవిగా దర్శనం ఇవ్వడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని విద్యార్థులకు సరస్వతి పూజా కార్యక్రమంలో పూజలు అందుకున్న నోట్ బుక్కులు, పెన్నులు, పలకలను అందించారు. అనంతరం గ్రామంలో కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వమించారు.

## ఆరోగ్య ఉప కేంద్రానికి వెంటనే భవనం నిర్మించాలి

### సిపిఐ జిల్లా కమిటీ సభ్యులు కత్తుల భాస్కర్‌రెడ్డి



చేర్యాల, అక్టోబర్ 20, మనం న్యూస్ః చేర్యాల మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి ఆరోగ్య ఉప కేంద్రానికి రూ.20 లక్షలు మంజూరైనప్పటికీ పనులు చేపట్టలేదని, వెంటనే పనులు చేపట్టాలని కత్తుల భాస్కర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆరోగ్య ఉప కేంద్రానికి భవనం మంజూరైనప్పటికీ నేటి వరకు పనులు చేపట్టడం లేదని, ఏఈ వెంటనే ఉప కేంద్ర నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే గ్రామస్తులతో ఏఈ కార్యాలయం ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

## బీసి ఎస్సీ ఎస్టీ మత మైనార్టీల రాజ్య స్థాపన లక్ష్యంగా ఎన్నికల బరిలోకి

### ధర్మసమాజ్ పార్టీ సిద్దిపేట అసెంబ్లీ అభ్యర్థి కర్రోల్ల బాబు




సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 20, మనం న్యూస్ః రాష్ట్రంలో బిసి, ఎస్సీ ఎస్టీ మత మైనార్టీల రాజ్య స్థాపన లక్ష్యంగా రాష్ట్రంలో 119 నియోజకవర్గాల్లో ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థులను ఎన్నికల బరిలోకి నిలుపుతుందని పార్టీ సిద్దిపేట నియోజకవర్గ అభ్యర్థి కర్రోల్ల బాబు అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ మొదటి విడతలో భాగంగా సిద్దిపేట అభ్యర్థిగా తనను నిర్ణయించినందుకు సమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ విశారదన్ మహారాజ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. రాష్ట్రంలో 10 శాతం లేని అగ్రకులాల ఆధిపత్యంపై 90 శాతం అనగారిన వర్గాల ప్రజల తరుపున ధర్మ సమాజ్ పార్టీ ధర్మ యుద్ధం పేరుతో ఎన్నికల బరిలోకి వస్తుందన్నారు. అనగారిన వర్గాల ప్రజల సకల సమస్యలు పోవాలంటే అణగారిన వర్గాల ప్రజలందరికీ విద్య, వైద్యం, ఉపాధి, చేతినిండా పని, ఇల్లు, భూమి వంటివి కావాలంటే మీ అమూల్యమైన ఓటును టార్చ్‌లైట్ గుర్తుపై వేసి ఆశీర్వదించాలని కోరారు. ఈ సమావేశంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు డిబి. రాజ్, దుబ్బాక నియోజకవర్గ అభ్యర్థి ప్రసన్న, సురేష్, జ్యోతి, సుమన్, సిద్ధు, బాబురావు, జోసెఫ్, బాబు తదితరులు పాల్గొన్నారు.



## త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డికి కప్పర భాను ప్రసాద్‌రావు సన్మానం

గజ్వేల్, అక్టోబర్ 20, మనం న్యూస్ః తెలంగాణకు చెందిన బీజేపి నేత నల్లు ఇంద్రసేనారెడ్డి త్రిపుర గవర్నర్‌గా నియమితులయ్యారు. జార్ఖండ్ మాజీ ముఖ్య మంత్రి రఘుబర్ దాస్‌ను ఒడిశా గవర్నర్‌గా నియమించారు. సూర్యాపేట జిల్లాకు చెందిన ఇంద్రసేనారెడ్డి ఉమ్మడి రాష్ట్రంలో బీజేపి అధ్యక్షులుగా పని చేశారు. మలక్‌పేట స్థానం నుండి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. గవర్నర్‌గా నియమితులైన ఇంద్రసేనారెడ్డికి బీజేపి నాయకులు కప్పర ప్రసాద్‌రావు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంద్రన్నకు గవర్నర్ పదవి దక్కడం నమ్మకానికి దక్కిన గౌరవమని, అది కేవలం బీజేపిలో మాత్రమే సాధ్యమవుతుందన్నారు. హర్యానా గవర్నర్ దత్తాత్రేయ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఇలా చాలా మంది సాధారణ కుటుంబాల్లో పుట్టిన రాజకీయ నేపథ్యం లేని ఎంతో మందిని తెలుగు రాష్ట్రాల నుండి ఉన్నతమైన పదవులకు ఎంపిక చేసిన ప్రధాని మోదీ, అమిత్ షాలకు కృతజ్ఞతలు తెలిపారు.

## సీఎం కేసీఆర్‌కు నాగలి బహుకరించిన దేవి రవిందర్



కొండపాక, అక్టోబర్ 20, మనం న్యూస్ః సీఎం కేసీఆర్ ఎంపిటిసిల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవిందర్ నాగలి బొమ్మను బహుకరించారు. శుక్రవారం గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులతో మేడ్చల్ జిల్లా అంతాయి పల్లిలోని ఎస్ఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా సీఎం కేసీఆర్ హాజరై పార్టీ నాయకులకు దిశా నిర్దేశం చేశారు. గజ్వేల్‌లో పార్టీ గెలుపు కోసం అందరూ సమిష్టిగా పని చేయాలని వారిలో ఉత్తేజాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో ఉ మ్మడి కొండపాక మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫస్ట్‌రౌండ్ ఈవియంల ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

### జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జె పాటిల్

సిద్దిపేట, అక్టోబర్ 20, మనం న్యూస్ ప్రతినిధిః ఎన్నికల సంఘం నిబంధనల మేరకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల సమక్షంలో పూర్తి పారదర్శకంగా కంప్యూటర్ ద్వారా ఆటోమేటిక్ పద్ధతిలో ఈవియంల మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయినట్లు జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జె పాటిల్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవియంల ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేసి జిల్లాలోని నాలుగు శాసనసభ నియోజకవర్గాలలో గల పోలింగ్ కేంద్రాలకు అదనంగా 25







శాతం బ్యాలన్సింగ్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లను, 40 శాతం వివి ప్యాట్లను కేటాయించినట్లు తెలిపారు. ఎన్నికల పోలింగ్ సిబ్బందికి రిటర్నింగ్ అధికారుల సమక్షంలో శిక్షణ ఇచ్చేందుకు శనివారం కొండపాక మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ గోడౌన్‌లో ఈవియం మిషన్‌లను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్కాన్ చేసి ప్రతి నియోజకవర్గానికి 102 ఈవియంలను రిటర్నింగ్ అధికారులకు అందజేసి పోలీస్ బందోబస్తు మధ్య నియోజకవర్గ కేంద్రాలకు పంపడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్‌రెడ్డి, ఎన్నికల సూపరిండెంట్ రామేశ్వర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ఓటరు జాబితాలో మీ పేరు ఉందో లేదో తెలుసుకునేందుకు ఓటర్ హెల్ప్‌లైన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని, సంబంధిత వెబ్‌సైట్ ద్వారా కూడా తెలుసుకోవచ్చని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ ప్రజలకు తెలిపారు.



## మిషన్‌భగీరథను సందర్శించిన బీహార్ పంచాయతీరాజ్ ఆడిటర్‌లు



గజ్వేల్, అక్టోబర్ 20, మనం న్యూస్ః డా. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో ఏడు రోజుల శిక్షణలో భాగంగా బీహార్ రాష్ట్రానికి చెందిన 156 మందితో కూడిన పంచాయతీరాజ్ ఆడిటర్స్ బృందం శుక్రవారం మిషన భగీరథ ప్రాజెక్టును సందర్శించారు. వారు సంస్థ డైరెక్టర్ జనరల్ శశాంక్ గోయల్ ఆదేశాల మేరకు కోర్సు డైరెక్టర్ జయశ్రీ సూచనలతో కోర్సు కో ఆర్డినేటర్ డా. శ్రీనివాస్ పర్యవేక్షణలో మిషన్ భగీరథ, 540 ఎంఎల్‌డి నీటి శుద్ధీకరణ కేంద్రంను మంగో ల్‌లో సందర్శించి సంతోషం వ్యక్తం చేశారు. అధికారులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ తీరును కొనియాడారు. అధికారులందరికీ ప్రాజెక్టు డిప్యూటీ ఇంజనీర్ నాగార్జున రావు ప్రాజెక్టు ప్రాముఖ్యత, పనితీరు వివరించారు. ఈ కార్యక్రమంలో మిషన భగీరథ ఇంజనీర్‌లు వీణ, శ్రీధర్‌లు పాల్గొన్నారరు.

## కొండపాకలో ఘనంగా సద్దుల బతుకమ్మ



కొండపాక, అక్టోబర్ 20, మనం న్యూస్ః మండల కేంద్రమైన కొండ పాకలో సద్దుల బతుకమ్మ పండుగను ప్రజలు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ గ్రామంలో ఏడు రోజులకే సద్దుల బతుకమ్మ పండుగ నిర్వహించుకోవడం తరతరాలుగా వస్తున్న ఆచారం. గ్రామం ఏడుతో ముడిపడి ఉన్న సాంప్రదాయం. సద్దుల బతుకమ్మ సందర్భంగా పెద్ద ఎత్తున పెద్ద బతుకమ్మలను పేర్చి గ్రామంలో ఆడపడుచులు ఉయ్యాల పాటల మధ్య చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిట్టి మాధురి దేవేందర్‌రెడ్డి, ఎంపిటిసిలు మంచాల అనసూయ కనకరాములు, ఆరుట్ల లక్ష్మి కనకయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.





## పోలింగ్ సిబ్బందికి పూర్తి స్థాయిలో శిక్షణ

### జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్




సిద్దిపేట, అక్టోబర్ 20, మనం న్యూస్ ప్రతినిధిః ఎన్నికల పోలిం గ్ సిబ్బందికి అన్ని అంశాల్లో పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జె పాటిల్ ఎన్నికల రిసోర్స్ పర్సన్స్‌కు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఎన్నికల రిసోర్స్ పర్సన్స్‌కు ఎన్నికల నిబంధనలు, ఎన్నికల ప్రక్రియపై జిల్లా కలెక్టర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో అధికారులు, సిబ్బంది కీలక పాత్ర పోషిస్తారని, ఎన్నికల పోలింగ్ విధుల్లో పాల్గొనే ప్రతి ఒక్క అధికారికి వారికి కేటాయించిన విధులపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉన్నపుడే విధులు సక్రమంగా నిర్వహించగలర న్నారు. జిల్లా వ్యాప్తంగా 4 శాసనసభ నియోజకవర్గాల పరిధిలో గల ఎన్నికల పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు ఎన్నికల విధులు, ఎన్నికల నిర్వహణ, ఎన్నికల సంఘం నియమ నిబంధ నలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడం జరిగిందన్నారు. శాసనసభ నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ ఆద్వర్యంలో దసరా తర్వాత నుండి నిర్వహించే పోలింగ్ సిబ్బంది శిక్షణ కార్యక్రమంలో ప్రభావవంతంగా అవగాహన కల్పించాలన్నారు.

## అభివృద్ధికై బిఆర్‌ఎస్‌కే పట్టం కట్టాలి

### బిఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి



తొగుట, అక్టోబర్ 20, మనం న్యూస్ః అభివృద్ధి కావాలంటే బిఆర్‌ఎస్ పార్టీకే పట్టం కట్టాలని మండల బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి పిలుపునిచ్చారు. మండలం లోని వర్దరాజ్‌పల్లిలో బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా సొసైటీ చైర్మన్ హరికృష్ణారెడ్డి, సర్పంచ్ ఛత్రి రాజవ్వతో కలిసి ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉప ఎన్నికల్లో మాయమాటలు చెప్పిన ఎమ్మెల్యే రఘునందన్‌రావు పైసా పని చేసింది లేదన్నారు. మర్రికుంట రోడ్డుకు నిధులతోపాటు సిసి రోడ్లు, ముదిరాజ్, రెడ్డి, గౌడ సంఘం భవనాలకు నిధులు మంజూరు చేయించి 25 డబుల్ బెడ్‌రూమ్‌ల పూర్తిస్థాయి నిర్మాణానికి సహకరించిన ఘనత ఎంపి ప్రభాకర్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మొదటి నుండి వర్దరాజ్‌పల్లి బిఆర్‌ఎస్‌కు అండగా నిలుస్తూ వసుతదన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి బాసిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, ఏఎంసి ఛైర్మన్ దోమల కొమురయ్య, రైతుబంధు అధ్యక్షులు బోధనం కనకయ్య, సర్పంచ్‌లు తోయేటి ఎల్లం, గంగనిగళ్ల మల్లయ్య, సొసైటీ వైస్ ఛైర్మన్ కుర్మ యాదగిరి, గ్రామ పార్టీ అధ్యక్షులు పులి బైరయ్యతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు

### మండల పార్టీ అధ్యక్షులు బెండె మధు



గజ్వేల్, అక్టోబర్ 20, మనం న్యూస్ః మేడ్చల్ జిల్లా తూముకుంట మున్సిపాలిటీ పరిధిలోని అంతాయకుంలోని పుష్ప కన్వెన్షన్ హాల్‌లో గజ్వేల్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశానికి హాజరైన గజ్వేల్ మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, గ్రామ పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేసినందుకు మండల పార్టీ అధ్యక్షులు బెండె మధు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం కేసీఆర్ కార్యకర్తలకు, నాయకులకు పార్టీ కార్యక్రమాలపై దిశా నిర్దేశం చేయడం జరిగిందని, ఈసారి ఎన్నికల్లో కేసీఆర్‌ను లక్ష పై చిలుకు మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

# రాజకీయ పార్టీ కార్యక్రమాలకు ముందస్తు అనుమతి పొందాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్



సంగారెడ్డి, అక్టోబర్ 20, మనం న్యూస్‌: రాజకీయ పార్టీల సమావేశాలు, ర్యాలీలకు ముందస్తుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ సూచించారు. జిల్లాలో ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళి మేరకు నడుచుకోవాలని కోరారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు లౌడ్ స్పీకర్ల అనుమతి, సభలు, సమావేశాలు, ర్యాలీలకు, వాహనాలకు అనుమతి తప్పకుండా తీసుకోవాలన్నారు. అభ్యర్థి తన ఎన్నికల ఖర్చుల కోసం ప్రత్యేకంగా బ్యాంక్ అకౌంట్ తీయాలని, నామినేషన్ సమయంలో రిటర్నింగ్ అధికారికి ఆ వివరాలు అందించాల్సి ఉంటుందన్నారు. వ్యక్తిగత విమర్శలు చేయరాదని, ఓటర్లను మద్యం, డబ్బు, వస్తువుల పట్ల ప్రలోభాలకు గురి చేయవద్దని సూచించారు. సమావేశాలు నిర్వహించే సమయంలో పోలీస్ శాఖ వారికి తెలిపినట్లయితే శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు మాధురి , చంద్రశేఖర్, డిఆర్ఓ నగేష్, రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి



గజ్వేల్, అక్టోబర్ 20, మనం న్యూస్‌: వచ్చే శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ నవంబర్ నెలలో హైదరాబాద్‌లో జరిగే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ ఈనెల 28న గజ్వేల్ నియోజకవర్గంలోని ప్రజ్ఞాపూర్ బస్తీలో మందకృష్ణ మాదిగ మాదిగల విశ్వరూప మహాసభ రథయాత్ర వస్తుందన్నారు. నేడు సాయంత్రవ వర్గల్ మండలం చౌదర్‌పల్లి గ్రామంలో మాదిగ యువకులతో సమావేశం నిర్వహిస్తామన్నారు. ప్రజ్ఞాపూర్‌లో అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైస రాములు, ముంద్రాతికృష్ణ, పోతగల్ల లింగం, ముంద్రాతి నవీన్ తదితరులున్నారు.

## యువత స్వశక్తితోనే ఎదగాలి

### మున్సిపల్ వైస్ చైర్మన్ చింత గోపాల్




సదాశివపేట, అక్టోబర్ 20, మనం న్యూస్‌: యువత స్వశక్తితో ఎదగాలని మున్సిపల్ వైస్ చైర్మన్ చింత గోపాల్ అన్నారు. శుక్రవారం సదాశివపేటలోని మహమూద్ మహబూబ్ సుగుణ ఫ్రెష్ చికెన పాయింట్‌ను ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ యువత స్వశక్తితోనే వ్యాపార రంగంలో అభివృద్ధి సాధిస్తున్నారని, యువత వ్యాపారం ద్వారా ఆర్థికంగా ఎదుగుతుందన్నారు. ఈ సందర్భంగా మహమ్మద్ మహిముద్‌ను చింత గోపాల్ అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ పిల్లోడి విశ్వనాథం, బిఆర్ఎస్ నాయకులు తులసి, పద్మశాలి యువత గౌరవ అధ్యక్షులు డబ్బా నాని తదితరులు పాల్గొన్నారు.

## వాహనాల తనిఖీల్లో రూ.2 లక్షల 72 వేలు పట్టివేత



దౌల్తాబాద్, అక్టోబర్ 20, మనం న్యూస్‌: దౌల్తాబాద్ మండల పరిధిలోని ముబారస్‌పూర్ గ్రామం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా రూ.2 లక్షల 72 వేలు పట్టుబడ్డాయని ఫ్లైయింగ్ స్క్వాడ్ గఫూర్ తెలిపారు. పట్టుబడిన డబ్బులు దొమ్మాట గ్రామంలో రేణుక మాత వైన్స్‌కు సంబంధించిన బయ్యారం గ్రామానికి చెందిన దయానందరెడ్డికి చెందినవిగా తెలిపారు. ఎన్నికల కోడ్ ఉన్నందున వాహనాలు తనిఖీ చేసిన డబ్బులను ఎన్నికల అధికారికి పంపిస్తున్నామని పోలీస్ అధికారులు తెలిపారు. వారి వెంట దౌల్తాబాద్ పోలీసులు పాల్గొన్నారు.




## ఈవియం, వివిప్యాట్‌ల ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

### జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ శరత్



సంగారెడ్డి, అక్టోబర్ 20, మనం న్యూస్‌: ఎన్నికల నియ మావళి మేరకు రా జకీయ పార్టీల ప్రతినిధులు, రిటర్నింగ్ అధికారులు, సంబం . దిత ఎన్నికల విభాగం సిబ్బంది సమక్షంలో పూర్తి ఆన్‌లైన్ విధానం ద్వారా బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వివి ప్యాట్‌ల కేటాయింపు ప్రక్రియ పూర్తయిందని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ డా. శరత్ తెలిపారు. శుక్రవారం కంట్రోల్ యూ నిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వివి ప్యాట్ల మొదటి ర్యాండమైజేషన్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఐదు అసెంబ్లీలకు సంబంధించి ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్, బ్యా లెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివి ప్యాట్‌ల కేటాయింపు ప్రక్రియ పూర్తయిందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డిఆర్ఓ నగేష్, రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంబరాలు



దౌల్తాబాద్, అక్టోబర్ 20, మనం న్యూస్‌: బతుకమ్మ సంబరాల్లో భాగంగా దౌల్తాబాద్ మండల పరిధిలోని ఇందుప్రియాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం రోజున మహిళలు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. పిత్రు అమావాస్య మొదలుకొని సద్దుల బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్య కేంద్రంలోని ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, స్థానిక మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటలాడుతూ చెరువులో నిమజ్జనం చేశారు.

## బిఆర్ఎస్ పార్టీకి ఎన్నికల కోడ్ అంటే పట్టింపు లేదా

### కోడ్ ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలి


### కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అత్తు ఇమామ్



సిద్దిపేట రూరల్, అక్టోబర్ 20, మనం న్యూస్‌: బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను పార్టీ ప్రజాప్రతినిధులు ఇంకా కొనసాగిస్తున్నారని, దీనిపై ఎన్నికల అధికారులు స్పందించాలని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అత్తు ఇమామ్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించేలా బిఆర్ఎస్ పార్టీ వ్యవహరిస్తుందన్నారు. పట్టణంలోని 20వ వార్డు కౌన్సిలర్ రియాజ్ పారిశుద్ధ్య కార్మికులకు బతుకమ్మ చీరలను, రూ.500 నగదును అందజేశారన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా ఇలా వ్యవహరించడం సరికాదన్నారు. జిల్లా కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ వెంటనే స్పందించి కౌన్సిలర్ రియాజ్‌పై కేసు నమోదు చేయాలని కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. తగిన చర్యలు తీసుకోని పక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మజార్ మాలిక్, గయజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## అనుమానస్పద స్థితిలో వ్యక్తి మృతి





దౌల్తాబాద్, అక్టోబర్ 20, మనం న్యూస్‌: అనుమానస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన దౌల్తాబాద్ మండల పరిధిలోని హైమద్‌నగర్ గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే నిజామాబాద్ జిల్లా మోస్రా మండల పరిధిలోని గోపూర్ గ్రామానికి చెందిన పోసంగారి భాస్కర్‌రెడ్డి భార్య లక్ష్మి, పిల్లలతో మేడ్చల్ పట్టణంలో ఉంటూ ఎలక్ట్రికల్ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. గురువారం ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయాడు. శుక్రవారం ఉదయాన తిరుమలాపూర్ మాజీ సర్పంచ్ యాదవరెడ్డి మృతుడి భార్య లక్ష్మికి చరవాణి ద్వారా సమాచారం అందించగా లక్ష్మి తన సోదరులతో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని భాస్కర్‌రెడ్డిగా గుర్తించారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇంట్లో నుండి వెళ్తూ మధ్యాహ్నం భోజనానికి వస్తావా అని అడగగా నేను ఊరికి వెళ్తున్నానని, మీరు కూడా సాయంత్రం పిల్లలను తీసుకొని మీ అమ్మ వాళ్ల ఇంటికి వెళ్లు నేను కూడా వస్తానని చెప్పాడని భార్య లక్ష్మి ఫిర్యాదులో పేర్కొన్నారు.లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని శవ పంచనామా నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. మృతుడికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.



## ఆల్వేన్ కాలనీలో గూడెం మహిపాల్‌రెడ్డి

## ప్రచారం మొదలు



సంగారెడ్డి, అక్టోబర్ 20, మనం న్యూస్‌: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తన ప్రచారం మొదలు పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిదేళ్లలో అభివృద్ధి చేసి చూపించిన ఘనత బిఆర్‌ఎస్ పార్టీకే దక్కుతుందన్నారు. బీజేపి, కాంగ్రెస్ పార్టీలు గొడవలు పెట్టి బురద జల్లాలని చూస్తున్నాయని, అలాంటి పార్టీలు ప్రచారంలో ఎదురైనపుడు పక్కనుండి వెళ్లడమే మంచిదన్నారు. అనంతరం ప్రతి ఇంటికి వెళ్లి సీఎం కేసీఆర్ నాయకత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను వివరించి ఓట్లను అభ్యర్థించారు. బిఆర్‌ఎస్‌కు ప్రజలు సంపూర్ణ మద్దతు ఇస్తున్నారన్నారు. ఆయన వెంట సతీమణి గూడెం యాదమ్మ మహిపాల్‌రెడ్డి, పటాన్‌చెరు ఏఎంసి ఛైర్మన్ విజయకుమార్, పట్టణ పార్టీ అధ్యక్షులు అప్జల్, సీనియర్ నాయకులు మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్లను ప్రలోభాలకు గురి చేయరాదు

**-ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు**

**-జిల్లా ఎస్పీ సి.హెచ్. రూపేష్**




సంగారెడ్డి, అక్టోబర్ 20, మనం న్యూస్‌: త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల దృష్ట్యా ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేలా వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించడం చట్టవిరుద్ధమని జిల్లా ఎస్పీ సి.హెచ్. రూపేష్ అన్నారు. శుక్రవారం రోజున ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఎన్నికల నియమావళి తప్పకుండా పాటించాలన్నారు. ఎన్నికలదృష్ట్యా జిల్లా నలుమూలల సరిహద్దు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి అక్రమ డబ్బు, మద్యం రవాణాను నివారించడం జరుగుతుందన్నారు. జిల్లా ప్రజలు ఎన్నికల నియమావళికి కట్టుబడి ఉండాలని, ఎవరు కూడా ఇతర పార్టీలనుగానీ, వ్యక్తులనుగానీ కించపరిచేలా వ్యాఖ్యలు చేయరాదన్నారు. ప్రజలు ప్రలోభాలకు గురి కాకుండా తమ విలువైన ఓటును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. ఎవరైనా ప్రలోభాలకు గురిచేసినట్లయితే చట్టరీత్యా శిక్షార్హులవుతారన్నారు. ముఖ్యంగా యువత ఎన్నికల సమయంలో తప్పుడు సమాచారాన్ని సోషల్ మీడియా గ్రూప్‌లలో పోస్ట్ చేసినట్లయితే వారు కూడా ఎన్నికల నియమావళి ఉల్లంఘించినట్లే అని, వారిపై కూడా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, కావున యువత జాగ్రత్తగా ఉండాలని, ముఖ్యంగా ఆ గ్రూప్‌ల అడ్మిన్‌లపై చట్టరీత్యా కేసులు నమోదు చేయబడుతాయన్నారు.

# ఫోటోగ్రాఫర్ ఎన్నికల్లో

# అనిల్ ప్యానల్ విజయం

**-నీలం మధును మర్యాదపూర్వకంగా కలిసిన అసోసియేషన్**

**-అభినందించిన నీలం మధు ముదిరాజ్**

పటాన్‌చెరు, అక్టోబర్ 20, మనం న్యూస్‌: పటాన్‌చెరు నియోజకవర్గంలోని రుద్రారం నుండి చందానగర్ వరకు గల ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్స్ యూనియన్ అధ్యక్ష ఎన్నికలు రసవత్తరంగా జరిగాయి. రెండు వర్గాల మధ్య హోరాహోరీగా జరిగిన ఈ ఎన్నికల్లో అనిల్‌కుమార్ ప్యానెల్ రెండు ఓట్ల తేడాతో కృష్ణ యాదవ్‌పై విజయం సాధించారు. ఈ సందర్భంగా ఎన్నికైన అనిల్ ప్యానల్ చిట్కుల్‌లోని నీలం మధు ముదిరాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారికి శుభాకాంక్షలు తెలిపారు. యూనియన్‌లో వర్గాలు ఉండకూడదని, ఎన్నికల్లో పోటీ చేసిన రెండు వర్గాలు సోదర భావంతో కలిసి





ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తాను ముందు నుండి ఫోటోగ్రాఫర్ల అభ్యున్నతికి అండగా ఉంటూ తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్నానన్నారు. ప్రస్తుతం పటాన్‌చెరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు ఫోటోగ్రాఫర్ అసోసియేషన్‌లో అందరి కుటుంబ సభ్యులు మద్దతు తెలపాలని, తాను విజయం సాధించగానే అసోసియేషన్‌లోని అందరికీ వంద గజాల చొప్పున ఇంటి స్థలాలు ఇస్తానని హామీ ఇచ్చారు. నూతనంగా ఎన్నికైన యూనియన్‌కు తన మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి లక్ష్మారెడ్డి, వీరేశం, నరసింహ, తన్మయి, రజనీకాంత్, జగన్, రాజేష్, రవిందర్ తదితరులు పాల్గొన్నారు.




## వంద శాతం ఓటింగ్ సాధిద్దాం

**జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

మెదక్/పాపన్నపేట, అక్టోబర్ 20, మనం న్యూస్‌: త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో జిల్లాలో వందశాతం ఓటింగ్ సాధించడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేసి ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. మెదక్ నియోజకవర్గంలోని కొత్తపల్లి, యూసుఫ్‌పేట గ్రామాల్లో ఓటరు నమోదు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ రోహిణి ప్రియదర్శిని పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ వందశాతం ఓటింగ్ లక్ష్యంతో అధికారులు పని చేయాలన్నారు. ప్రజల్లో ఓటు పట్ల చైతన్యం తీసుకురావాలని సూచించారు. ఓటు బ్రహ్మాస్త్రమని, దేశాన్ని ప్రభావితం చేసే శక్తి కేవలం ఓటుకు మాత్రమే ఉందన్నారు. ఎవరైనా ఓటు నమోదు చేసుకోకపోతే ఈనెల 31వ తేదీ వరకు అవకాశం ఉందని, ఓటింగ్‌లో గతంఓ 3వ స్థానంలో ఉన్న జిల్లా మొదటి స్థానంలో ఈసారి నిలపాలన్నారు. నవంబర్ 10 నుండి 25 వరకు ఓటరు గుర్తింపు స్లిప్‌లు అందిస్తామని తెలిపారు. జిల్లాలోని రెండు నియోజక వర్గాల్లో ఓటరు చైతన్య రథం ద్వారా ప్రచారం చేస్తున్నామని, వంద శాతం ఓటింగ్ లక్ష్యంగా ప్రచారం చేయాలని తెలిపారు. నేను ఖచ్చితంగా ఓటు వేస్తాను... అనే నినాదంతో ప్రజలంతా ఓటింగ్‌లో భాగస్వామ్యం కావాలన్నారు. ఏవైనా ఫిర్యాదలుంటే సి విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చని, కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1950కి కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని, డబ్బు, మద్యం, ఏదైనా వస్తువులు పంపిణీ జరిగినా నేరుగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ అంబదాస్, రాజేశ్వర్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఎంపి, పిఎంపి వెల్ఫేర్ అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనం



సంగారెడ్డి, అక్టోబర్ 20, మనం న్యూస్‌: సంగారెడ్డి పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ స్థాయి ఆర్ఎంపి, పిఎంపి వెల్ఫేర్ వైద్యుల అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి చింతా ప్రభాకర్, ఎంఎస్ఐడిసి ఛైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ చింతా ప్రభాకర్‌కు తమ పూర్తి మద్దతు ఇస్తామని ఏకగ్రీవ తీర్మానం చేసి అందించారు. చింతా ప్రభాకర్‌తో తమ బంధం ఇలానే కొనసాగుతుందని, ఆయన చేసిన సేవలకు వారి రుణం తీర్చుకోవడానికి ఓటు అనే ఆయుధంతో తీర్చుకుంటామన్నారు. వారికి కమిటీ హాల్ మంజూరు చేయాలని ఆయన దృష్టికి తీసుకురాగా ఫోన్‌తో సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. అనంతరం ప్రభాకర్ మాట్లాడుతూ నా సేవలను గుర్తించి తనకు సీఎం కేసీఆర్ ఆశీర్వదించి మరోసారి అవకాశం కల్పించారని, ఏకగ్రీవంగా తీర్మానం చేసి మద్దతు ఇస్తామన్న ఆర్ఎంపి, పిఎంపిలకు ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పీటిసి మనోహర్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు చక్రపాణి, డా . శ్రీహరి, సిడిసి ఛైర్మన్ విజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## పాపన్నపేట మండలంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**పాల్గొన్న మైనంపల్లి శివాని, ఎంపిపి చందన ప్రశాంత్‌రెడ్డి**



పాపన్నపేట, అక్టోబర్ 20, మనం న్యూస్ః పాపన్నపేట మండల వ్యాప్తంగా బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. మండల పరిధిలోని మల్లంపేటలో అట్ల బతుకమ్మ సంబరాల్లో కాంగ్రెస్ పార్టీ మెదక్ నియోజకవర్గం అభ్యర్థి మైనంపల్లి రోహిత్‌రావు సతీమణి మైనంపల్లి శివాని ఎంపిపి చందన ప్రశాంత్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి పాడారు. గ్రామస్తులు ఆమెతో సెల్ఫీలు దిగడానికి పోటీపడ్డారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బతుకమ్మ వేడుకల్లో భాగంగా మల్లంపేటకు రావడం, గ్రామ మహిళలతో కలిసి ఆడడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాపురెడ్డి, మహిళలు, గ్రామ యువకులు పాల్గొన్నారు.

## బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి



మెదక్, అక్టోబర్ 20, మనం న్యూస్ః ప్రకృతిని పూజించే గొప్ప సంస్కృతి మనదేనని మెదక్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మెదక్ పట్టణంలోని రామాయలయం వీధితోపాటు పట్టణంలోని పలు వార్డుల్లో బతుకమ్మ సంబరాల్లో ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తీరొక్క పూవులను సేకరించి బతుకమ్మగా పేర్చి ప్రకృతిని పూజించే గొప్ప సంస్కృతి మన తెలంగాణదని, ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని సూచించారు. పట్టణ మహిళలు చిన్నారులతో కలిసి బతుకమ్మ ఆడారు. బతుకమ్మ ఆటపాటలతో అంతా ఉత్సాహంగా గడిపారు.

## అనస్థీషియా వైద్యుల సంఘం అధ్యక్షులుగా డా. దామోదర్



సిద్దిపేట రూరల్, అక్టోబర్ 20, మనం న్యూస్ః సిద్దిపేట జిల్లా అనస్థీషి యా విభాగ వైద్యుల సంఘం అధ్యక్షులుగా డా. దామోదర్ ఎన్నికయ్యారు. జిల్లా అనస్థీషియా విభాగం వైద్యుల సంఘం నూతన కార్యవర్గాన్ని సిద్దిపేటలోని ఐఎంఏ హాల్‌లో శుక్రవారం ఎన్నుకున్నారు. కార్యదర్శిగా డా. అనుపమ ప్రియదర్శిని, కోశాధికారిగా డా. కాచం జగదీశ్వర్, ఉపాధ్యక్షులుగా డా. చందు, సంయుక్త కార్యదర్శిగా డా. దేవేందర్, కార్యవర్గ సభ్యులుగా డా. కళ్యాణ్, డా. ప్రతాప్, డా. సురేష్, డా. వీణలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం వారు మాట్లాడుతూ సమాజంలో మత్తు వైద్యుల పత్ర  చాలా కీలకమైందన్నారు సిపిఆర్‌పై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. మత్తు వైద్యుల సంఘంతో సిద్దిపేట మత్తు వైద్యులందరికీ ఉపయోగకరంగా ఉంటుందని జాతీయ అధ్యక్షులు డా. భీమేశ్వర్ తెలిపారు.

# బతుకమ్మ.... మా బతుకు మార్చమ్మా

చిన్నకోడూరు, అక్టోబర్ 20, మనం న్యూస్ః ఏడు రోజుల సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మను భక్తిశ్రద్ధలతో ఆటలాడి పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు. మహిళలు ఒకరికొకరు గౌరమ్మను పూజించుకొని సద్దులు పట్టుకొని భక్తి పారవశ్యంలో మునిగితేలారు. అనాది నుండి వస్తున్న ఆచారం ఈ ఏడు రోజుల సద్దుల పండుగ. రాష్ట్ర వ్యాప్తంగా తొమ్మిది రోజులకు నిర్వహిస్తే చిన్నకోడూరు మండలంలోని కొన్ని గ్రామాలతోపాటు కొండపాక, నంగునూరు మండలాలలో ఏడురోజుల్లోనే సద్దుల బతుకమ్మ నిర్వహిస్తారు. మమ్మల్ని చల్లగా చూడు బతుకమ్మ... మా బతుకుల్ని మార్చమ్మా... అంటూ మహిళలు ప్రసాదాలు పంచుకొని ఈ ఏడు ఏ అంట వ్యాధులు, ఏ రోగాలు రాకుండా ప్రజలను చల్లగా చూడమ్మా అంటూ భక్తిశ్రద్ధలతో పూజించారు. చిన్నారుల కేరింతలు, రంగు రంగుల పూలతో గ్రామాలన్నీ కొత్త శోభను సంతరించుకున్నాయి. సద్దుల సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గ్రామాలలో చెరువుల వద్ద గ్రామ పంచాయతీల పాలకవర్గం ప్రత్యేక చర్యలు తీసుకున్నాయి. మండల కేంద్రంలో ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు ఇట్టబోయిన శ్రీనివాస్ బతుకమ్మ



నిమజ్జనం చేసి ప్రజలకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా దగ్గరుండి చర్యలు తీసుకున్నారు. మెట్‌పల్లిలో సర్పంచ్ విజయ వినయ్‌రెడ్డి చెరువు ప్రాంతంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టారు.







# ఏడుపాయల్లో అంగరంగ వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

**-సరస్వతి మాతగా వనదుర్గాదేవి దర్శనం**

**-అమ్మవారికి భక్తులు బోనాల సమర్పణ**

**-దర్శించుకున్న ఎమ్మెల్యే, అడిషనల్ కలెక్టర్**

పాపన్నపేట, అక్టోబర్ 20, మనం న్యూస్ః తెలంగాణలో ప్రఖ్యాతిగాంచిన ఏడుపాయల శ్రీ వనదుర్గామాత దేవస్థానం నందు దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం వనదుర్గా దేవి సరస్వతి మాతగా భక్తులకు దర్శనమిచ్చింది. ఆలయ అర్చకులు దుర్గామాతను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక గోకుల్ షెడ్‌లో ఏర్పాటు చేసిన దుర్గామాత ఉత్సవ మండపం నుండి భక్తులు బోనాలు తీసుకొని ప్రధాన ఆలయానికి డప్పు చప్పుళ్ల మధ్య తీసుకువెళ్లి





అమ్మవారికి సమర్పించారు. జోగిని శివాని బోనమెత్తి నాట్యం చేసిన తీరు అందరినీ ఆకర్షించింది. కాగా దుర్గామాతను మెదక్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ రమేష్‌లు దర్శించుకున్నారు. దేవస్థాన పాలక మండలి చైర్మన్ బాలా గౌడ్, ఈఓ మోహన్‌రెడ్డిలు వారికి ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికి శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తలు మోహన్‌రావు, సిద్ధిరాములు, వెంకటేశం, మనోహర్, రఘువీర్, నాగభూషణం, సాయిలు, పెంటయ్య, సాయిలు, చక్రపాణి, యాదవ్ గౌడ్, బాగారెడ్డి, శ్రీనివాస్‌రావు, మణెమ్మ, ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు

# ఎంపిపి రవిందర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం

**ప్రజల నుండి విశేష స్పందన**

జిన్నారం, అక్టోబర్ 20, మనం న్యూస్ః జిన్నారం మండల పరిధిలోని నల్తూరు గ్రామంలో కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలను గడపగడపకు తిరుగుతూ వివరించడం జరుగుతుందని, వీటి ద్వారా ప్రజల నుండి విశేష స్పందన వస్తుందని ఎంపిపి రవిందర్ గౌడ్ తెలిపారు. శుక్రవారం నల్తూరులో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో బిఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు ఓటు రూపంలో బుద్ధి చెప్పే సమయం వచ్చిందని హెచ్చరించారు. ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీ వైపే చూస్తున్నారని, రాబోయేది ఇందిరమ్మ రాజ్యం, పటాన్‌చెరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని కాట శ్రీనివాస్ గౌడ్ విజయాన్ని ఎవరూ ఆపలేరని, కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు భరోసానిచ్చారు. ఈ



కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్డె కృష్ణ, శ్రీకాంత్‌రెడ్డి, ఊట్ల గ్రామ ఉప సర్పంచ్ జింకల రవిందర్ , ప్రవీణ్‌చారి, నరేందర్, గంగు రాజు, శేఖర్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.